క్లుప్తంగా

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

రామన్నపేట : వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతబీట్ బజార్‌లో మంగళవారం నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న మహాలక్ష్మి కిరాణంషాపు యజమాని గుండేటి రాముపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో రూ.45,850 విలువ గల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడిలో ఎస్సై శరత్, ఇంతేజార్‌గంజ్ ఎస్సై వెంకన్న, సిబ్బంది రాజు, రవికుమార్, దయాకర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


అయూబ్

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలోని సుందరయ్యనగర్ ఏనుమాములకు చెందిన మతిస్థిమితం లేని ఎండీ.అయూబ్(28) అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..అబ్దుల్ బాసిత్ కుమారుడు అయూబ్ చిన్నప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి ఇంటి పట్టునే ఉంటున్నాడు. మంగళవారం ఉదయాన్నే ఇంటినుంచి అయూబ్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు, నగర వీధుల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అబ్దుల్ బాసిత్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శంభునిపేటలో వివాహిత..

ఖిలా వరంగల్ : వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రాంతానికి చెందిన ఓ వివాహిత గత నెల 30న ఆదివారం అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం. శంభునిపేటకు చెందిన ఎండీ.యాకూబ్ భార్య యాసీన్ జూన్ 30న ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం తిరిగిరాలేదు. యాకూబ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రజాసంఘం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా రామకృష్ణ



హసన్‌పర్తి: తెలంగాణ ప్రజా సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన సంగరబోయిన రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు సతీష్ ప్రకటించారు. నియామకానికి సహకరించిన ప్రజాసంఘం నాయకులకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

న్యూశాయంపేట : ఈనెల 4న దేశవ్యాప్త పిలుపులో భాగంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యారంగాన్ని మోదీ అభాసుపాలు చేస్తున్నాడని ఆరోపించారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. స్టాలిన్, పరిమళ, అజయ్, పాషా పాల్గొన్నారు.

6న బహిరంగ వేలం

కాశిబుగ్గ : వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తొలగించిన చెట్లకు ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.జమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) వేర్వేరుగా నిర్మాణం జరుగుతున్నాయని అందులో భాగంగా నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించామని తెలిపారు. ఈ చెట్లకు శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నామని అసక్తి గల వారు వచ్చి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

రైల్వే డాక్టర్‌కు సన్మానం



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రి సీనియర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావును మంగళవారం డాక్టర్స్ డేను పురస్కరించుకొని రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ జోనల్ సహాయ కార్యదర్శి సి.హెచ్.కొమ్మాలు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ తరాలపల్లి బ్రాంచి కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.కె.మల్లయ్య పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు

- నిత్యం రద్దీగా డబ్బాల జంక్షన్
- ఎండకు, వానతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


రోడ్డు పైనే బస్‌కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

నయింనగర్: హనుమకొండ డబ్బాల జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ వరంగల్‌లో స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా స్మార్ట్ బస్ షెల్టర్లను నగరంలో అంతటా ఏర్పాటు చేశారు. కానీ నిత్యం రద్దీగా ఉండే అవసరమైన హనుమకొండలోని డబ్బాల జంక్షన్ కేయూ–ములుగురోడ్ దారిలో ఇరువైపుల ఏర్పాటు చేయలేదు. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా లేకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన ప్రయాణిస్తున్నారు. నిత్య ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వివిధ అవసరాల కోసం వెళ్లే ప్రజలు డబ్బాల జంక్షన్ నుంచి కరీంనగర్, కాజీపేట, హనుమకొండ వరంగల్, పరకాల, ముచ్చర్ల, నాగారం, అంబాల, పెగడపల్లి వైపు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు.

షెల్టర్ అందరికి అవసరం

బస్‌షెల్టర్ అందరికి అవసరం. ఇక్కడ ఏర్పాటు చేయడం మున్సిపాలిటీ అధికారులకు తెలుసని, కొందరు దుకాణదారులు అభ్యంతరం చేయకపోతే ఏర్పాటు చేస్తాం.

– రజిత శ్రీనివాస్, 54వ డివిజన్ కార్పొరేటర్

కనీస సదుపాయాలు లేవు

ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నా కనీస సదుపాయాలు చేయకపోవడం దారుణం. బస్‌షెల్టర్ లేకపోవడం స్మార్ట్ సిటీగా పిలుస్తున్నా నగరానికే అవమానకరంగా ఉంది.

–కె.వేణుగోపాల్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత

విద్యార్థులు బాగా చదువుకోవాలి


విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న వెంకటరమణ

కాశిబుగ్గ : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని వీఏకె ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరం కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) టెన్త్ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన ధర్మపురి సురేందర్, కుందుకూరి అక్షిత్‌ల ఉన్నత చదువుల కోసం చెరో రూ. 12వేలు చొప్పున చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో పరీక్ష కిట్లను అందజేసే క్రమంలో పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహం అందజేస్తానని తెలిపారు. అందులో భాగంగానే ఇద్దరికి ప్రోత్సాహం అందజేసినట్లు చెప్పారు. 17 ఏళ్లుగా వన్నాల అరవింద్‌కుమార్ స్థాపించిన సమాఖ్య వీఏకె ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, హరిశంకర్, మెరుగు ప్రకాష్, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేస్తున్న డాక్టర్ భగీరథ

ఖిలా వరంగల్ : పేదలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుండె వైద్యనిపుణులు డాక్టర్ అచ్చ భగీరథ అన్నారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ సాకరాశికుంట మహారాజకాలనీలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు ఆధ్వర్యంలో ఫాదర్ కొలంబియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ మెడికేర్ హాస్పిటల్ గుండె వైద్యనిపుణులు డాక్టర్ అచ్చ భగీరథ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది పేద ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం వైద్యులు సేవాభావంతో వైద్య సేవ అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిలకర వీరస్వామి, సతీష్, స్థానిక మహిళలు, పురుషులు పాల్గొన్నారు

మాదిగల మహాజాతరను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కాజీపేట రూరల్ : ఈనెల 7న మాదిగల పుణ్యక్షేత్రం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామంలో జరిగే జరిగే మాదిగల మాహాజాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి, జాతీయ నాయకుడు పిల్లి కిష్టపర్ పిలుపునిచ్చారు. నగరంలోని 63వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి హలో మాదిగ చలో ఈదుముడి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం కాజీపేట మండలం ఎమ్మార్పీఎస్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ రాజకీయ పోరాట సమితి, మహాజన పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రమేష్‌కుమార్ ఆదేశాలనుసారం ఈ కరపత్రాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జెరిపోతుల విల్సన్, హన్మకొండ ఉపాధ్యక్షుడు కరుణాకర్, జన్ను విరణ్, తాటికొండ రాజేష్, మాదాసి బిక్షపతి, నద్దునూరి కార్తిక్, ఐలయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంను కలిసిన అద్దె బస్సుల యజమానులు


ఆర్‌ఎం విజయభానుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అద్దె బస్సుల యజమానులు

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభానును ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. ఇటీవల ఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన విజయభానును అద్దె బస్సుల యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి, జన్నపురెడ్డి వెంకట్‌రెడ్డి, బి.సైదులు, ఆర్. రాంబాబు, టి.శ్రీనివాస్‌రెడ్డి, ఫర్వేజ్, రాజు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అద్దె బస్సుల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు.

6 నుంచి శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు


శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా గల శ్రీరాజరాజేశ్వరిదేవీ దేవాలయంలో ఆషాఢశుద్ధ పాడ్యమి ఈనెల 6న శనివారం నుంచి 20వ తేదీ వరకు శాకంబరీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆలయ అర్చకులు ఝెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు గణపతి సుబ్రమణ్యం, సూర్యనర్సింహా, శివబాల లలిత రాజశ్యామల ఆవరణ అర్చనలు, లలిత సహస్రనామ, సౌందర్యలహరి పారాయణం, హారతి, భోజనప్రసాదాలు, సాయంత్రం అర్చనలు, 20వ తేదీన పౌర్ణమి రోజు వివిధ రకాల కూరగాయలతో అలంకరణ, పౌర్ణమి పూజ జరుగుతాయని తెలిపారు.

గ్రేటర్ ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్‌గా కృష్ణారెడ్డి

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్‌ఏసీ) అడిషనల్ కమిషనర్‌గా, సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తాజాగా బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఉద్యోగ విరమణ పొందారు. సెక్రటరీ విజయలక్ష్మి వ్యక్తిగత కారణాల వల్ల జూలై 9 వరకు సెలవుల్లో ఉన్నారు. దీంతో పరిపాలన వ్యవహారాలను దృష్టిలో పెట్టుకొని డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి అదనపు బాధ్యలు అప్పగించారు. కొత్త అడిషనల్ కమిషనర్ బదిలీపై వచ్చేంత వరకు ఆయన కొనసాగనున్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి


నిలిచిన కాకతీయ కళాతోరణం పనులు

హసన్‌పర్తి : జగిత్యాల–కోదాడ 563 జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారి మార్గమధ్యలోని ఎల్లాపురం సెంటర్‌లో కాకతీయ కళాతోరణం నిర్మాణానికి రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. కందకాలు తీసి ఇలాగే వదిలి పెట్టారు. రాత్రివేళ ఈ రహదారి ప్రయాణం భారంగా మారింది. వాహనాలు అదుపు తప్పితే నేరుగా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే పనులు పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



హన్మకొండ: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా బస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్, ఉద్యోగులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎం మోహన్‌రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు అవి వృక్షాలుగా వృద్ధి చెందేలా కాపాడాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ పరిధి బాపూజీనగర్ ఫీడర్‌లోని బాలాజీనగర్ ప్రసాద్ హాస్పిటల్ ఏరియాలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, హనుమకొండ రాంనగర్, పోలీసు హెడ్‌క్వార్టర్స్, గోకుల్‌నగర్ ప్రాంతంలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాశిబుగ్గ : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేట వైపు గల వరంగల్ రైల్వే స్టేషన్ సిగ్నల్ పాయింట్–2 సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన కథనం ప్రకారం మృతుడు 5.6 ఎత్తు, చామన చాయ రంగు, కోల ముఖం కలిగి పొట్టపై పుట్టు మచ్చతో ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని సీఐ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కర్ 94403 61941, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

పదెకరాలు పరిగణనలోకి తీసుకోవాలి

- రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ


మాట్లాడుతున్న డీసీఓ నాగేశ్వర్‌రావు

హసన్‌పర్తి: రైతు భరోసాకు పదెకరాలు పరిగణనలోకి తీసుకోవాలని రైతు తమ అభిప్రాయాలు వ్యక్తపర్చారు. హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సమావేశం మంగళవారం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి అ ధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయేతర భూములకు కూడా రైతుభరోసా వర్తింపజేస్తున్నారని రైతులు చెప్పారు. గుట్టలు, ఖాళీ స్థలాలు, వెంచర్లు, వాగులకు కూడా వ ర్తింపజేస్తున్నారని చెప్పారు. ఆ భూములకు ఇచ్చిన పట్టా పాస్‌పుస్తకాలు వెంటనే రద్దు చేయాలని రైతులు సూచించారు. కౌలు రైతులకు సాయం అందిస్తే బాగుంటోందని రైతులు తమ అభిప్రాయాలు వ్య క్తం చేశారు. రైతు భరోసాకు బదులుగా గ్రామాన్ని మూడు నాలుగు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి, ఆ క్లస్టర్‌ల్లో వ్యవసాయ సంబంధిత యంత్రాలు ఏర్పాటు చేస్తే ఉపయోగపడుతాయని రైతులు చెప్పారు.

కౌలు చట్టం తీసుకురావాలి

కౌలు చట్టం తీసుకురావాలని పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగులు, ఐటీ చెల్లించే వారిని రైతు భరోసా జాబితా నుంచి తప్పించాలని చెప్పారు. సమావేశంలో ఏఓ అనురాధ, నోడల్ ఆఫీసర్ సత్యానందం, పీఏసీఎస్ డైరెక్టర్లు విజేందర్‌రెడ్డి, రమేష్, కర్ణాకర్, జానకి ,చేరాలు, రవీందర్‌రెడ్డి, రైతులు రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, సంపత్, టీఆర్‌కే రెడ్డి పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు నవీన్‌నాయక్

హన్మకొండ: మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని గిరిజన ఐక్య సంఘాల నాయకులు కోరారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివాసీ, గిరిజన సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు బానోతు నవీన్ నాయక్, తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావత్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉంటూ, పార్టీ పటిష్టతకు కృషి చేసే వ్యక్తి బలరాంనాయక్ అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రొఫెసర్ బాబురావు, సమూలాల్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్, ఆయా సంఘాల నాయకులు నందా నాయక్, సామల నాయక్, ప్రొఫెసర్ బూర ముత్యలింగం, లావణ్య రాజు నాయక్, వీరమ్మ, జయ బాయ్, అర్పిత, మేడా రంజిత్ కుమార్, రాజ్ కుమార్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో నిరసన దీక్ష


దీక్ష కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 30 ఏళ్లుగా సాగుతున్న పోరాటాన్ని రాచపుండుగా మారుస్తున్న రాజకీయ పార్టీల వైఖరికి నిరసనగా, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ దీక్ష చేపడుతున్నారని ఆ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా తెలిపారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వంగపల్లి దీక్ష కరపత్రాలు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 2000 సంవత్సరంలో వర్గీకరణ సాధించిందని, కొందరు కోవర్టులు కోర్టుకు వెళ్లడంతో 2004లో వర్గీకరణ నిలిచిపోయిందన్నారు. 2004లో అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారని, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2024 వరకు బీజేపీ అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసం చేశాయని విమర్శించారు. దేశంలో ఎంతో కఠినమైన సమస్యలను పరిష్కారం చూపిన బీజేపీ ఎస్సీ వర్గీకరణ విషయంలో నాన్చివేత ధోరణి అవలంబిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణ సాధన కోసం ఈ నెల 7న చేపట్టిన దీక్షలు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిలువేరు సుధాకర్, అంబాల చక్రపాణి, జన్ను సంజీవ్, మాస్ ప్రవీణ్, గిన్నారాపు అనిల్ కుమార్, రాజశేఖర్, హనుమకొండ సతీష్, జన్ను కిరణ్, బన్నీ, దిలీప్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రామన్నపేట : నిరుద్యోగ యువతకు వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ములుగురోడ్డు జంక్షన్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు అంతా కలిసి ఉద్యమించామని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు జరిగి ఎంతో మందికి నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు వస్తాయని పేర్కొన్నా ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు వేయకపోవడం సిగ్గుచేటన్నారు. గ్రూపు–2, 3 పోస్టులు వెంటనే పెంచాలని, గ్రూపు –1 ప్రిలిమ్స్‌లో 1:100 అభ్యర్థులను షార్ట్ జాబితా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సుజిత్ పాల్గొన్నారు.

జెండా మారగానే గొంతు మార్చిన నేతలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వర్ రావు

హన్మకొండ: జెండా మారగానే గొంతు మార్చారని కాంగ్రెస్ నాయకుల తీరును బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు దుయ్యబట్టారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో కలిసి కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సోమవారం ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న వారిలో చాలా మందికి బీఆర్‌ఎస్, గులాబీ జెండా రాజకీయ జీవితం ఇచ్చిందన్నారు. ఇప్పుడు జెండా మారగానే రాజకీయ అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని, బీఆర్‌ఎస్‌ను, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను, మాజీ ఎమ్మెల్యేలను విమర్శించే అర్హత వారికి లేదన్నారు. వారికి ఓరుగల్లుపై చిత్తశుద్ధి ఉంటే కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తామంటే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చవటలు, దద్దమ్మలని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి వస్తే వరాలు ఇస్తారని, కానీ వచ్చి ఎలాంటి వరాలు ఇవ్వకుండా వెళ్లారన్నారు. కార్పొరేటర్ తోట వెంకన్న సహా కాంగ్రెస్ నాయకుల కబ్జాలను బయటకు తీస్తామన్నారు. బీఆర్‌ఎస్ విద్యార్థి వి భాగం రాష్ట్ర నాయకుడు బి.వీరేందర్ మాట్లాడుతూ ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన తీరు చూస్తే సిగ్గేస్తుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, లోహిత రా జు, రంజిత్ రావు, చెన్నం మధు, దివ్యారాణి రాజు నాయక్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, సారంగపాణి, ఖుద్దూస్, సంపత్‌రెడ్డి, కనకరా జు, పరుశురాములు, రజినీకాంత్, రఘు, ప్రశాంత్, వీరస్వామి,రంజిత్, మహమూద్, సుమన్ పాల్గొన్నారు.